# శునకయాగం

సాయంత్రం అయిదున్నర....! రోడ్డు ప్రక్క ఫుట్‌పాత్ మీద నడుస్తున్నాను.... రోడ్డు రద్దీగా ఉంది.... రొదపెడుతూన్నట్టుగా ఉంది. వాహనాలు దుమ్మెత్తి పోస్తూ హారన్ల నోళ్ళతో అరచి గీపెడుతున్నాయి.

శబ్ద వాతావరణ కాలుష్యాలు జంటగా జ్ఞానేంద్రియాలపై దాడి చేస్తోంటే....

ఏక కాలంలో ముక్కూ చెవులూ, కళ్ళూ మూసుకోలేక, చికాకుగా చకచకా నడుస్తున్నాను.

నడక నాకు ఆనందమే కాదు... ఒక అనుభూతి కూడా...! ఆరోగ్య రీత్యా ఉదయం, సాయంత్రం, రెండు మూడు కిలోమీటర్లు విధిగా నడుస్తూంటాను.

ఫుట్‌పాత్‌ల మీద జనం...పుట్టలోంచి పుట్టుకొస్తూన్న చీమల్లా జనం......అందరూ పరుగులు దీస్తున్నట్టే నడుస్తున్నారు. ... ఒకటే పరుగు! ఏమిటో ఆ ఆరాటం,... ఆ పోరాటం... ఎవరూ వెనక్కి తిరిగి చూడడం లేదు....

ఆ జనంలో, రద్దీలో, రొదలో... నా వెనుక ఎవరో మెత్తగా నడుస్తూ నన్నునుసరిస్తూన్న అలికిడి... అడుగుల సవ్వడి... ఎవరు..? నా భ్రమా... ? వెనక్కి తిరిగి చూశాను... భ్రమకాదు... వాస్తవమే! నా వెంట నడుస్తూ వస్తోంది చిన్న కుక్క పిల్ల... తెల్లగా, బొద్దుగా నల్లటి మచ్చలతో, బుల్లిబుల్లి కాళ్ళతో... కళ్ళతో....

నేను ఆగాను... ఆ కుక్కపిల్లా ఆగింది.... నేను ముందుకు నడుస్తున్నాను. కుక్క పిల్లా నాతో బాటు అడుగులు వేస్తోంది. ఏమిటిది? మసీదు మైకులోంచి సాయంత్రపు ప్రార్థన " అల్లాహెూ అక్బర్" తరంగాలుగా నా చెవుల్ని తాకుతుంది. కోటయ్య స్వీట్‌స్టాల్ ముందు కాజాల్ని కొనుక్కుని, జనం అక్కడికక్కడే నిలబడి ఆవురావురుమంటూ తింటున్నారు... బూల్‌చంద్ వందరూపాయలకే మారుతీ కారు! అద్దాల్లోంచి ఆహ్వానిస్తూ వస్త్రాల్ని కారు కలల్ని కూడా కొనుక్కోమంటూంది.

గ్లాస్ హౌస్ జంక్షన్‌లో ఆగి వెనక్కితిరిగాను.ఆ కుక్కపిల్లా నాతో బాటు నడుస్తూ ఆగింది. నా పాదాల్ని చెప్పుల్ని తన చిన్న నాలుకతో స్పృశిస్తూ 'కుంయ్, కుంయ్' మంటోంది. ముక్కుతోంది.... మూలుగుతోంది. ఎవరిదీ కుక్కపిల్ల..? ఎక్కడకు పోతోంది..? దారి తప్పినడుస్తోందా...? ఈ జనంలో రద్దీలో ఎవరికాళ్ళ కిందపడినా... ఏ వాహనం కబలించినా, దీనికి దిక్కేమిటి....? గబుక్కున కుక్కపిల్లను రెండుచేతులతోను ఎత్తుకున్నాను.... ఒక చేత్తో ఆత్మీయంగా దాని ఒళ్ళంతా నిమిరాను... 'కుంయ్ కుంయ్' మంటూ కుదురుగా అది నా చేతుల్లో ఒదిగిపోయింది.

నేను ముందుకు సాగిపోయాను... నాకెందుకో అడుగులు తేలిపడుతున్నాయి.... ఆ జనంలోంచి, అలా కుక్కపిల్లను ఎత్తుకుని నడుస్తోంటే.... ఏదో తియ్యటి అనుభూతి నా ఒళ్లంతా ప్రవహిస్తోంది. మరిచిపోయిన మధురబాల్యస్మృతులు ఏవో మస్తిష్కంలో పరిమళిస్తున్నాయి. చిన్నప్పుడు మట్టిదిబ్బల్లో కాలం తెలియకుండా కుక్కపిల్లలతో

ఆడుకోవడం... వాటికి మట్టిపూయడం,... ఒళ్ళంతా మట్టి పూసుకోవడం... కుక్కపిల్లల్ని భుజాలకెత్తుకుని పరుగెత్తడం... దొంగతనంగా, పాలు త్రాగించడం... బిస్కట్లు తినిపించడం... అమ్మ బెత్తం పట్టుకుని, తరిమికొట్టడం...ఒకసారి తల్లి కుక్క మీదకు దూకి, పిక్క పట్టుకోవడం, భయంతో నేను కేకలు పెట్టి గుక్క పట్టి ఏడవడం... ఆ అనుభవంతో కుక్కపిల్లల సరదా కొండెక్కడం... ఓహ్... ఎన్ని అనుభూతులు.... ?మరెన్ని బాల్య స్మృతులు?

కుక్కపిల్లతో బాటు నేనూ ఒక చిన్నపిల్లాడిగా మారిపోయిన భావన, అణువణువునా నాకు..అనిర్వచనీయమైన ఆనందాన్నిస్తోంది...! "నమస్తే! సార్! మిమ్మల్నే! ఒక సారిలా దయచేయండి!" ఆలోచన్ల నుంచి తెప్పరిల్లి అటుగా చూశాను. 'సత్యా కాంప్లెక్స్ బెస్ట్‌కలక్షన్' షాపులోంచి, శ్రీను పిలుస్తున్నాడు. అతను మా ఆఫీసులోనే క్లాస్ ఫోర్ ఉద్యోగి... ఖాళీ సమయాల్లో బంధువుల కొట్లో కూర్చుని వాళ్ళకు సాయం చేస్తుంటాడు....

" ఏమిటి సార్ .... ? కుక్క పిల్లతో నడుస్తున్నారు...? కొన్నారా...,.. ? ఎంత ... ? భలే అందంగా ఉంది సార్.... ? అల్సేషియనా ... ?"

" కాదు... రోడ్డుమీద దొరికిందోయ్...." నా మాటకు ఎందుకో శ్రీను కిసుక్కుమని నవ్వాడు. నా చేతుల్లోని కుక్కపిల్లను తన చేతుల్లోకి తీసుకుని ముద్దుమీద ముద్దు పెట్టుకున్నాడు.

" సారు జోక్ చేస్తున్నారు... రోడ్డు మీద కుక్కపిల్లని మీరెందుకు ఎత్తుకుంటార్ సార్...? బుజ్జిముండ.... బావుంది... ఈబిస్కట్లు పెట్టండి.... !" శ్రీను నవ్వుతూ బిస్కట్ పాకెట్ ఒకటి నా చేతికి ఇవ్వబోయాడు. నేను తీసుకోలేదు. కుక్కపిల్ల రోడ్డుమీద దొరికిందంటే శ్రీను జోక్ అనుకుంటున్నాడు. దాన్ని నేను ఎత్తుకోవడం చిన్నతనంగా భావిస్తున్నాడు.... ఎందుకనీ...?

ఇది నిజంగా రోడ్డుమీద కుక్కపిల్ల కాదా.. ? అతను అన్నట్లు అల్సేషియనా? మరీ పట్టుబడితే, శ్రీను చేతిలో పది రూపాయలు పెట్టి బిస్కట్ పేకెట్ తీసుకున్నాను. పేకెట్ విప్పి ఒక బిస్కట్ దాని నోటి ముందు ఉంచాను...

ఊహూ., అది ముట్టుకోలేదు... దాని చిన్ని బొజ్జ ఖాళీగానే ఉంది... పాపం! ఎందువల్లనో అది భయపడింది... బెంగపడింది. శ్రీనుతో చెప్పి ముందుకు కదిలాను....

ఫుట్‌పాత్ మీదే పూల దుకాణాలు... అందంగా పేర్చిన అగరువత్తుల కట్టలు... కర్పూరపు దండలు.. గంధపు చెక్కలు... సాంబ్రాణీ కడ్డీలు... విభూతిపళ్ళు... అయ్యప్ప స్వామి మాలలు... నల్లటి వస్త్రాలు... రుద్రాక్షలు... అన్నీ అమ్మకాలే... ఈ కొట్లముందు నడుస్తూ ఉంటే ఏ స్వర్గలోకపు సుగంధాలో నన్ను చుట్టుముట్టేసినట్లవుతుంది.... మనసూ, శరీరం, ఆ సౌరభాల వెల్లువలో తడిసి ముద్దయి, ఏదో అలౌకికానందంలో మునిగిపోతుంటాను.

" హల్లో! ఏమిటి కుక్కపిల్లతో నడుస్తున్నారు... ? మీతోబాటు షికారు చేయిస్తున్నారా...? బావుంది... డాబర్ జాతి పిల్లలా ఉందే... ? ఎక్కడ కొన్నారేమిటి?"

ఎదురుగా మిత్రుడు విశ్వనాథం పలకరింపు... ఆయన నా సహోద్యోగి... సన్మిత్రుడు... కొన్ని క్షణాలు చిరునవ్వే సమాధానంగా నిలబడి...

" లేదండీ!రోడ్డు మీద నా వెంట నడుస్తోంటే ఎత్తుకున్నాను."

" నమ్మమంటారా... ? ఏమో లెండి! ఎంతైనా స్పందించే వర్గానికి చెందినవారు కదా! ఇంట్లో పిల్లల్ని సాకడానికే మాకు సమయం సరిపోవడం లేదు. రోడ్డు మీద కుక్కపిల్లల్ని కూడా సాకుతున్నారంటే... మీ ఓపిక...''

సందిగ్ధంగా ఆగిపోయాడాయన.

" విశ్వనాథంగారూ! ఇక్కడ ఉండాల్సింది.... ఓపిక కాదు... హృదయం అనుకుంటానండీ... !'' ఆలోచనగా అన్నాను.

" అంతే లెండీ.. ఆ హృదయమే అందరికీ ఉంటే.. ఈ విశ్వం స్వరూపమే మరో రూపంలో ఉండేది.... వస్తాను.... బాదం వారి సందులో కొంచెం పనుంది...''

విశ్వనాథం చేతి సంచితో నన్నుదాటి వెళ్ళిపోయాడు..... నా చేతిలోని కుక్కపిల్లని ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నాను.... అది కుంయ్, కుంయ్‌మంటూ మూలుగుతూ నా చేతిని నాకుతోంది. దాని స్పర్శలో అవ్యక్తమైన అనుభూతి, ప్రేమ నాలో పొంగి పొరలుతున్నాయి.

ఇది మంచి జాతి కుక్కపిల్లేనేమో! ఎవరింట్లో నుంచో బయటపడి పాపం రోడ్డున పడింది.... దాన్ని ఏమిటి చేయడం...? ఆలోచనగా అడుగులు వేస్తున్నాను.

సాధారణంగా" జగన్నాధపురం వంతెన", నా నడకకు గమ్యస్థానం, ఆ వంతెన మీద నిలబడి, కాస్సేపు అటూ ఇటూ లంగరేసుకున్న మరపడవల్నీ మనుషుల్నీ పరికించి, తెరలు తెరలుగా వచ్చే ఆ ఏటి ఉప్పుగాలి పీల్చి వెనక్కి మళ్ళు తుంటాను.

పట్నాల చిట్టయ్య బంగారపు కొట్టు దాటాను. నాలుగడుగులు వేశానో లేదో"'వెల్‌కమ్' హెూటలు సందులోంచి మోపెడ్ ఒకటి బర్రుమంటూ వచ్చి నా ముందు ఆగింది. అదిరిపడి తలెత్తి చూసాను. మోపెడ్ మీద నవ్వు ముఖంతో సాయిప్రసాద్, నటుడు, ప్రయోక్త.... !

"నమస్కారం! ఖద్దరు లాల్చీ, పైజామా.... మెడ చుట్టూ మఫ్లరు, చేతుల్లో ఈ కుక్కపిల్లా... మిమ్మల్నిలా చూస్తోంటే ఏమనిపిస్తోందో చెప్పమంటారా?'' మోపెడ్‌కి స్టాండు వేస్తూ భళ్ళుమని నవ్వాడాయన.

" చెప్పాలనుకున్నాక, వద్దన్నా మీరు ఆగరు! చెప్పండి... !" ఆయన నవ్వుతో నేను శ్రుతి కలిపాను.

"లోకంలోని దుఃఖానికి కారణం వెతకటం కోసం బయలుదేరిన సిద్దార్థుడిలా ఉన్నారు... కాదంటారా?..'' మరోసారి భళ్ళుమన్నాడు...

"ఎంతమాట సార్...? నా పేరును బట్టి మీకలాంటి ఊహ వచ్చిందేమో! ఆయన భగవానుడు... లోక కళ్యాణార్థం జన్మించిన కారణ జన్ముడు... మనం మానవ మాత్రులం... లోకంలోని దుఃఖానికి కారణం ఏమిటో మనం తెలుసుకోగలిగితే... ఈ ప్రపంచాన్ని తెలుసుకున్నట్టే... ఏమైనా మీ భావుకత్వానికి నా జోహార్లు...'' అభినందనగా అన్నాను...!

నా మాటలకు సాయిప్రసాదు ఎలా స్పందించాడో.. నా చేతిలోని కుక్కపిల్లను చటుక్కున అందిపుచ్చుకున్నాడు. దాని ఒళ్ళంతా నిమిరాడు...

" ఇదేదో విదేశీ కుక్కపిల్లలా ఉందేమిటి సార్... ? పోలీసు వేటకు ఇలాంటి జాతి

కుక్కల్నే బాగా ఉపయోగిస్తారు. బహుశా 'డేష్' జాతిదయి ఉంటుంది. ఎంతకు కొన్నారు దీన్ని..?'' సాయి కుక్కపిల్ల కాలి గోళ్ళని, వేళ్ళని పరిశీలిస్తూ అడిగాడు.

" కొనలేదు... ఫుట్‌పాత్ మీద ఇలా నడుస్తోంటే, ముక్కుతూ, మూలుగుతూ నా వెంటపడింది.... సరే! ఎవరిదో.. ఏమిటో, అనుకుంటూ ఎత్తుకున్నాను..'' "ఎవరిదయితేనేం లెండి! దాని అదృష్టం బావుంది.... మీ చేతుల్లో పడింది... జాతి కుక్కపిల్లేమో కదా! పోనీ నాకివ్వండి... పెంచుకుంటాను'' సాయిప్రసాద్ సాలోచనగా అడిగాడు.

" మంచి జాతిదయితేనే పెంటుకుంటారా... ?'' సూటిగా అడిగాను.

" కాకపోతే... ఎందుకుసార్? దండగ కదా?'' మొహమాటంగా అన్నాడు. ఆయన ముఖంలోని భావాల్ని క్షణకాలంలో చదవగలిగాను.

"రేపొకసారి ఇంటికి రండి! చూద్దాం!'' ముందుక కదిలాను నిర్మొహమాటంగా...! " తప్పకుండా.. శెలవ్... !'' సాయి, 'స్వప్న' టాకీస్ వైపు వెళ్ళిపోయాడు. మనుషుల్లో పేదా ధనిక భేదాలున్నట్టే జంతువుల్లోనూ తేడాలు, ఆ తేడాల్ని బట్టే వాటికి విలువలు ఇంతకూ ఈ కుక్కపిల్ల ఏ జాతికి చెందిందో... ? ఒకడు " అల్సేషియన్'' అన్నాడు... మరొకాయన "డాబర్'' జాతి పిల్లేమో అంటున్నాడు. ఏ జాతిదయితేనేం... ? ఇది కుక్కజాతికి చెందినదే.. అంతవరకూ సందేహం లేదు... పోనీ దీని నడుగుదామా...?

" బొమ్మన'' వస్త్ర భవనం దాటాను... నాళం వారి ఎరువుల కొట్టు ముందుగా నడుస్తూ ఎవరో అడ్డం వచ్చినట్టుగా ఆగిపోయాను. అల్లంత దూరంలో జగన్నాథపురం వంతెన, వాలుగా వాహనాలతో, రద్దీగా కనపడుతోంది. వంతెన మొదలు నేను నిలబడ్డ చోటు వరకూ గుంపుగుంపులుగా జనం...; గోలగా గొడవగా, ఎవరో గొంతు చించుకుని పరుగెడుతూ అరుస్తున్న అరుపులు... కేకలు..

కొన్ని క్షణాలు అక్కడ ఏం జరుగుతుందో నాకు అర్థం కాలేదు. రెండడుగులు ముందుకు వేశాను.... జనంలోకి చొచ్చుకుని దృష్టిని సారించాను. ఒళ్ళు గగుర్పొడిచినట్లయింది..... చేతిలోని కుక్కపిల్లను గుండెల్లో దాచుకున్నాను అతి భద్రంగా...!

ఎదురుగా, అయిదారుగురు వ్యక్తులు... వాళ్ళ చేతుల్లో దుడ్డుకర్రలు... నైలాన్ తాళ్ళతో అల్లిన వలలు... వాళ్ళు పురపాలక సంఘ పారిశుధ్యపు పనివాళ్ళు...!

అక్కడ దృశ్యం భీభత్సంగా ఉంది... !

అటూ ఇటూ ప్రాణభయంతో... భీతితో జనం కాళ్ళ మధ్యనుంచి సందుల్లోకి... సందుల్లోంచి జనం మధ్యలోకి, పరుగెడుతూన్న కుక్కల్ని వలేసి పట్టుకుని వాటి తలలమీదదుడ్డుకర్రలతో కర్కశంగా,యమకింకరుల్లా బాదుతున్నారు వాళ్ళు ... ఆకుక్కల తలలు చితికి నెత్తురు కక్కుకుంటూ ఎర్రటి రక్తం రోడ్డు మీద పారుతూంటే.. హాహాకారాలు... అరుపులు... మూలుగులు... కాళ్ళు కొట్టుకుంటూ, దయనీయంగా ప్రాణాలు విడుస్తోన్న వీధి కుక్కలు... అక్కడ పోలీసు నిలబడే, దిమ్మకు దిగువగా రెండు కుక్కల బండ్లు ... ఆ బండ్ల ఇనుప ఊసల మధ్య చనిపోయిన కుక్కలు...సగం చచ్చిన కుక్కలు... చావకుండా చావుకోసం భీతావహంగా ఎదురుచూస్తోన్న కుక్కలు... వీటిని ఎందుకిలా చంపేస్తున్నారు...?

ఏమిటి దారుణ హింస..? ఎక్కడిదీ శునకయాగం...?

కుక్కపిల్లను చేత్తో పట్టుకుని గిరుక్కున వెనక్కి తిరిగాను. ఎవరో కుడపుల్లో చేయిపెట్టి కెలుకుతున్నట్టుగా ఉంది... పరుగులాంటి నడక... అడుగులు తడబడుతున్నాయి.. ఆపాదమస్తకం అవయవాలు ఆవిర్లు విడుస్తున్నాయి...

"హల్లో! గౌతమ్‌జీ! ఆగండాగండి!" ఆ జనంలోంచి ఫుట్‌పాత్ మీదకు వస్తూ బాషా...! నేను బాషా ఒకే వీధిలోని ఇరుగుపొరుగువాళ్ళం. బాషా "జైన్ సిల్క్ పేలస్" లో పనిచేస్తున్నాడు...

" ఇది మామూలే సార్! వీధి కుక్కలు! రాత్రింబవళ్ళు వీధుల్లో తిరుగుతుంటాయి... కాళ్ళకు అడ్డం పడుతుంటాయి... కరుస్తుంటాయి.... అరుస్తుంటాయి... వీటివల్ల పట్నంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతోందనీ... ఈ కుక్కల్ని చంపేస్తుంటారు, భాయి... మూకుమ్మడిగా మొత్తం అన్నీ ఒకసారి చచ్చేలా కరెంటు షాకు పెడుతూంటారు... మీ చేతుల్లోని కుక్కపిల్ల కూడా మన వీధిలోదే... దీని తల్లిని కూడా వీళ్ళు ప్రొద్దుట పట్టుకుపోయారు. పాపం దానికి నాలుగు పిల్లలు పుట్టాయి... నాలుగూ నాలుగు దిక్కులకి చెదిరిపోయాయి... ఏం చేస్తాం...? ఇదంతా నగరంలో మన శాంతి భద్రతల కోసం, అనుకోవడమే... వస్తాను..."!

బాషా 'జైన్ పేలస్'లోకి వెళ్ళిపోయాడు. నడుస్తూ ఉన్నానన్న మాటే కాని... నరనరాల్లో సన్నటి ప్రకంపనం... హృదయంలో ఏదో సుడులు తిరుగుతూన్న బాధ.. వెనుకనించి కుక్కల అరుపులు దీనంగా వినబడుతున్నాయి..... ఆ అరుపుల్లోంచి ఏవో ప్రశ్నలు... సంధించి విడిచిన బాణాల్లా..... నా కర్ణభేరిని ఢీకొంటున్నాయి...

" మేము వీధి కుక్కలమనేగా ... శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నామనేగా మమ్మల్ని దారుణంగా చంపుతున్నారు. .. మీలోకంలో ... మీ జాతిలో ... నిత్యం శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నవాళ్ళు ఎంతమంది లేరు...? రౌడీలు, హంతకులు,దొంగలు, ఖూనీకోర్లు, గూండాలు... నడిరోడ్డుమీద గొడ్డళ్ళతో నరుకుతూన్న వాళ్ళు.... నిండుజనంతో ఉన్న బస్సును తగలబెడుతూన్నవాళ్ళు... కారుల్లో... బజారుల్లో మనుషుల గుంపుల మధ్య బాంబులు పెడుతూన్నవాళ్ళు.... పట్టాలమీద రైళ్ళను పేలుస్తున్నవాళ్ళు... నిర్ధాక్షిణ్యంగా గాలిలో విమానాల్ని కూలుస్తున్నవాళ్ళు... మనుషుల్ని పిట్టల్లా కాలుస్తున్నవాళ్ళు... వీళ్ళంతా ఎవరు...? శాంతి భద్రతల్ని భంగం చేస్తున్న వాళ్లు కాదా... ? వాట్ని సమాజంలో నిలువునా ఖూనీ చేసి కల్లోలాల్ని సృష్టిస్తున్న వాళ్ళు కాదా...? వీళ్ళందరికీ మా లాగే శిక్షలు విధిస్తున్నారా...? విధించలేం..? ఎందుకనీ...?ఎందుకనీ..?

వీధి కుక్కలు అరుస్తూనే ఉన్నాయి.....

'శునకయాగాన్ని' ప్రశ్నిస్తూనే ఉన్నాయి...

నేను చరచరాముందుకు నడుస్తున్నాను...

నా చేతుల్లో కుక్కపిల్ల నిశ్చింతంగా నిద్రపోతోంది...!

❀ ❀ ❀ ❀ ❀ ❀ (జాగృతి ఆగష్టు - 31, సెప్టెంబరు 6, 1998)

(శ్రీ శారద లలిత కళావేదిక... సాహితీ పురస్కారం, ప్రథమ బహుమతి)